
# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 70 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 01 మే 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 70 01-05-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-

## దేవినేని కుమారుడి వివాహం..

హాజరైన తెలంగాణ సీఎం, మంత్రి లోకేశ్, ప్రముఖులు

- మిగతా 2 లో..




# అప్పన్న సన్నిధిలో అపశృతి..

- తొమ్మిది మంది భక్తులు మృతి
- పలువురికి గాయాలు

సింహాచలం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సింహాచలం అప్పన్న స్వామి చందనోత్సవంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి, ఆలయం వద్ద కొత్తగా నిర్మించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఈ ఘటనలో తొమ్మిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. పదుల సంఖ్యలో భక్తులు గాయపడ్డారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స

- తరువాయి 2లో..



## సింహాచలం ఘటనపై మోడీ విచారం..

### నష్టపరిహారం ప్రకటన

న్యూఢిల్లీ ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి చందనోత్సవంలో గోడ కూలి తొమ్మిది మంది భక్తులు మృతి చెందిన దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా మృతుల

- తరువాయి 2లో..

## మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం

### సిఎం చంద్రబాబు



సింహాచలం దుర్ఘటన పై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడినవారికి రూ.3లక్షల చొప్పున పరిహారం అందజేయాలని అధికారులను ఆదేశించారు.
బాధిత కుటుంబ

- తరువాయి 2లో..



మృతుల వివరాలు..

పత్తి దుర్గాస్వామి నాయుడు (32), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా ఎడ్ల వెంకటరావు (48) అడవివరం, విశాఖపట్నం కుమ్మపట్ల మణికంఠ (28), మాచవరం, తూర్పుగోదావరి జిల్లా గుజ్జరి మహాలక్ష్మి (65), హెబీ కాలనీ, వెంకోజీ పాలెం, విశాఖపట్నం పైలా వెంకటరత్నం (45), ఉమానగర్, వెంకోజీ పాలెం, విశాఖపట్నం పిళ్లా ఉమామహేశ్ (30), చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం పిళ్లా శైలజ (26) చంద్రంపాలెం, మధురవాడ, విశాఖపట్నం



## ఏపీతో సహా మూడు రాష్ట్రాలలో మోడీ పర్యటన

### షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల్లో మూడు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. మే 1, 2 తేదీల్లో మహారాష్ట్ర , కేరళ , ఆంధ్రప్రదేశ్‌లలో ప్రధాని

- తరువాయి 2లో..

## అమరావతి పునఃప్రారంభం కార్యక్రమానికి అందరూ తరలిరండి..



- పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామన్న చంద్రబాబునాయుడు
- టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్

అమరావతి ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతిలో పర్యటించి రూ. 49,040 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయనున్నారని ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..

## సింహాచలం ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష



విశాఖపట్నం ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సింహాచలం ప్రమాద ఘటనపై ఉన్నతాధికారులు, మంత్రులతో సిఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్న మంత్రులు ఆనం, డోలా బాల వీరాంజనేయ స్వామి, అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపి భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజు, జిల్లా అధికారులు

- తరువాయి 2లో..



## తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల

### టెన్త్ పరీక్షలలో 92.78 శాతం ఉత్తీర్ణత ..

### ఫలితాలలో మహబూబాబాద్ జిల్లా టాప్

విజయవాడ, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్ %-% టెన్త్ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. బుధవారం మధ్యాహ్నం రవీంద్రభారతిలో జరిగిన ఒక కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పదో తరగతి పరీక్షల ఫలితాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తీర్ణులైన విద్యార్థులను

- తరువాయి 2లో..

## పిసిసి చీఫ్ షర్మిల హౌస్ అరెస్ట్ ..



విజయవాడ, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విజయవాడ ? ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి హౌస్ అరెస్ట్ అయ్యారు. ఉద్దండరాయుని పాలెంలో ఈరోజు (బుధవారం) షర్మిల పర్యటించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఏపీసీసీ చీఫ్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. 2015లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉద్దండరాయుని పాలెంలో శంకుస్థాపన చేశారు. ఈ క్రమంలో

- తరువాయి 2లో..

## కారు బీభత్సం.. ఐదుగురు వైద్య విద్యార్థులు సహా ఆరుగురి మృతి

నెల్లూరు, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



నెల్లూరు జిల్లా కోవూరు మండలంలో కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఐదుగురు వైద్య విద్యార్థులు సహా వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటనపై వివరాల ప్రకారం.. పొతిరెడ్డిపాలెం వద్ద ఓ ఇంట్లోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆ ఇంట్లో నివసిస్తున్న వెంకట రమణయ్య (50) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు పోలీసులు, 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతూ ఐదుగురు వైద్య విద్యార్థులు సైతం ప్రాణాలు కోల్పోయారు. మృతులను జీవన్, విఘ్నేష్, నరేశ్, అభిసాయి, అభిషేక్‌గా గుర్తించారు. మరో విద్యార్థి మౌనిత్ రెడ్డి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ సెకండ్ ఇయర్ చదువుతున్నట్లు సమాచారం.

## సంపాదకీయం

# కాశ్మీర హృదయం

ముళ్లను అంటుకునే పరిమళం ఉన్నట్టు, చీకటిని చీల్చుకుని వెలుతురు వికసించినట్టు, రాక్షసత్వం నశించి మానవత్వం జయిస్తుంది. మానవత్వం నిండిన మనిషే నిలుస్తాడు. "ఓహో! మానవుడా! అన్యాయం భరించలేని వాడా! విప్లవుడా! వీరుడా! ప్రేమించేవాడా! ఆదర్శజీవీ! మహాత్మా! మానవుడా" అని శ్రీశ్రీ పాడుకున్నట్టు, మానవుడు నిలుస్తాడు గెలుస్తాడు. హృదయాలనెన్నో గెలుచుకుంటాడు. మనిషి గుండెలో లోలోపల ఎక్కడో.. మానవీయ మానవుడు మేలుకొనే ఉంటాడు. వాడిని నిదురింపజేసి, నిదురపుచ్చి, మత్తునిచ్చి, మతమునో, గతమునో, కులమునో, ప్రాంతమునో, ఏదో ఒకటి నింపి ఉన్మాదాన్ని మేల్‌కొలుపుతుంటారు. వేల ఏండ్లుగా జరుగుతున్నదిదే. స్వార్థ ప్రయోజనాల కోసం ఈ తంత్రం సాగుతోంది. మనుషుల హననం జరుగుతోంది. ఇప్పుడు కాశ్మీర్‌లో జరిగిందీ అదే. కల్లు తెరచి రెండోవైపు చూస్తే వెల్లివిరిసిన మానవత్వం కళ్లనిండా పరుచుకుంటుంది. ఉగ్రదాడిలో ఇరవై ఎని మిది మంది ప్రాణాలు కోల్పోవటం, దుండగులు అత్యంత కిరాతకంగా వ్యవహరించడం ప్రపంచంలోని మను షులం దరికీ బాధ కలిగించింది. ఈ దుర్మార్గం వెనుక ఉన్న దేశాలు, రాజకీయాలు, పోషణలు, వ్యూహాలు, ఉన్మాదాలు అటుం చితే మానవీయ కోణాలను పరిశీలించాలి. ప్రేరణ పొందాలి. మన హృదయాలను సరిచేసుకోవాలి. యుద్ధం, ఉగ్రవాదం,మతోన్మాదం, అది ఎవరిదైనా ఎక్కడున్నా, ఎప్పుడైనా మానవ విధ్వంసకారిణే! మనుషులంతా ముక్తకంఠంతో ఖండించాలి. వ్యతిరేకించాలి. మనుషుల్ని కలిపే అంశాలేవో, విభజించే విషయాలేవో అవగాహన చేసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న అబద్ధాల పట్ల అప్రమత్తమవ్వాలి.

"బుల్లెట్లకు నా తండ్రిని కోల్పోయాను. కానీ కశ్మీరు నాకు ఇద్దరు సోదరులను ఇచ్చింది" అని బాధలోనూ మానవతను గుర్తించిన ఆరతి మాటలు వినండి "కాశ్మీర్‌లో మా కారు డ్రైవర్ ముసఫిర్, మరోవ్యక్తి సమీర్, నేను క్షేమంగా ఇంటికి చేరుకున్నానంటే వారి సాయంవల్లే. నాన్న మృతదేహం మార్చురీ నుండి ఇక్కడికి తీసుకొచ్చేవరకు అన్నీ వారే చూసుకున్నారు. నాన్న పోయిన బాధని దిగమింగుతున్న నా కళ్లు, వాళ్ల ప్రేమకి వర్షించాయి' అన్నది. ఆ మాటలు వింటుంటే మనందరి కళ్లూ చెమర్చటం లేదూ! ఛత్తీస్‌గఢ్ నుండి కశ్మీరు అందాలను చూసేందుక వెళ్లారు వాళ్లు. ఫొటోలు దిగుతున్నారు. కాల్పుల శబ్దాలు వినిపించాయి. వెంటనే ఆ యాత్రికుల గైడ్ నజకత్ అహ్మద్‌షా వారి ముగ్గురి పిల్లల్ని తీసుకుని ఒక చిన్నమార్గం గుండి పద్నాలుగు కిలోమీటర్లు పరుగెత్తుకుంటూ వెళ్లి పహల్గాంలో వారిని సురక్షితంగా ఉంచి, తిరిగొచ్చి నాలుగు జంటలను కాపాడాడు. అప్పటికే ఆ ఉగ్రదాడిలో తన మేనమామ కొడుకు ఆదిల్ ముష్కరుల తూటాలకు బలయ్యాడని తెలిసింది. అయినా పర్యాటకులు క్షేమంగా తిరిగి వెళ్లేవరకు వారివెంటే ఉండటం బాధ్యతగా భావించి, ఆదిల్ అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయానని నజకల్ ఆవేదనతో చెప్పటం వెనుక మానవీయ హృదయం కనపడటం లేదూ! నజకల్‌ను ముస్లింగా, మతస్తుడిగానే చూడగలుగుతామా! ఇక పర్యాటకుల హార్స్ రైడర్ స్వయంగా పర్యాటకులను కాపాడేందుకు ఉగ్రవాదులతో తలపడి ప్రాణాలొదిలిన అతడిని ముస్లిం అని పేర్కొంటామా? మానవత్వమున్న మనిషిగా గుర్తిస్తామా! ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడిన ఆదిల్‌షా షాజీద్ అహ్మద్ భట్, సాజద్‌నారు ఇంకా ఎందరినో చెప్పాలి. వాళ్లంతా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలిచిన నిజమైన భారతీయులు. "మమ్మల్ని కాల్చింది ముస్లింలే కానీ మాకు సహాయం చేసింది కూడా ముస్లింలే. హంతకుల మతాన్ని బట్టి, మతంలో వారందరినీ హంతకులని విద్వేషం ప్రచారం చేయడం తగనిపని" అని దాడికి గురయిన బాధితులు స్వయంగా చెబుతున్నారు. భిన్నత్వంలో ఏకత్వ అవగాహన ఇది.

శ్రీనగర్‌కు చెందిన డాక్టర్ ఇరాన్ ఏం చేసాడంటే, అధికధరలు, హైవే మూసివేత కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్న పర్యాటకుల కోసం తన ఇంటినే హెూటల్‌గా మార్చేశాడు. ఉచిత ఆవాసాన్ని అందించాడు. జెకె01ఎ/ఎల్ 6976. ఇది ఆటోనెంబర్. దీనిపై ఇలా రాసి ఉంది "పర్యాటకులకు ఉచిత ఆటో సర్వీసు. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్‌కు తీసుకుపోబడును". "మా దగ్గరికి అతిథులుగా వచ్చారు. వాళ్లని భద్రంగా పంపడమే మా బాధ్యత తప్ప, సొమ్ము చేసుకోవడం కాదు" అని చెబుతున్న కశ్మీరీలు మతానికి ముస్లింలయినా ఎంత గొప్పమనసు వాళ్లది. మతం వేరు. మతతత్వం వేరు. మతోన్మాద చర్యలూ వేరు. ఇంకా మనం అర్థం చేసుకోవడం లేదు. ఇదే సమయంలో పర్యా టకుల ఆందోళనతో సొంత ఊళ్లకు పరుగెడుతున్న వేళ, శ్రీనగర్ నుండి ఢిల్లీకి విమాన టికెట్ ధరను రూ.7వేల నుండి 55వేలకు పెంచేశారు మనదేశ భక్త విమానయాన సంస్థలు. ఇప్పుడే కాదు, ఉక్రెయిన్ రష్యా యుద్ధ సమయంలో 30వేల టికెట్ లక్షా ఇరవై వేలు పెంచింది మన టాటా ఎయిర్ ఇండియా. ఆఖరికి కుంభమేళాకు పెంచి దేశభక్తిని చాటుకున్నారు. ఏదిఏమైనా, భద్రతాలోపాల కారణంగా, నిఘా వర్గాల వైఫల్యం మూలంగా, ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదులను నిర్మూలించలేని అసమర్థత ఫలితంగా ఎన్నో విలువైన ప్రాణాలు సామాన్యులవి బలయ్యాయి. ఈ ఆపద సమయంలోనే కశ్మీరంలో నిజమైన మానవీయ హృదయం వెల్లడయింది.

# దేవినేని కుమారుడి వివాహం..

## హాజరైన తెలంగాణ సీఎం, మంత్రి లోకేశ్, ప్రముఖులు

**అమరావతి ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుమారుడు నిహార్ పెళ్లి వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. కంకిపాడులో జరిగిన ఈ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణతో పాటు ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు. ఇక, తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విజయవాడ వెళ్లిన సీఎం రేవంత్‌కు హెలిప్యాడ్ వద్ద ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి స్వాగతం పలికారు. మంత్రి లోకేశ్, సీఎం రేవంత్ రెడ్డి కలిసి వివాహ వేడుక వద్దకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



# అప్పన్న సన్నిధిలో అపశ్రుతి

అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. హెూంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదానికి కారణంగా, ఇటీవల నిర్మించిన గోడ నాణ్యత లోపంతో పాటు, వర్షానికి మట్టి నానిపోవడం వల్ల గోడపై ఒత్తిడి పెరిగి కూలిపోయినట్టు అధికారులు తెలిపారు .?

బాధ్యులపై చర్యలు

ఈ ఘటనపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిర్మాణ లోపాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. సింహాచలం ఆలయంలో భక్తుల భద్రతకు మరింత శ్రద్ధ తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు .?

**సింహాచలం ఘటన విషాదం - తెలంగాణ సిఎం రేవంత్ దిగ్భ్రాంతి**

%హైదరాబాద్: . చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో భక్తులు మరణించిన ఘటన తీవ్ర ఆవేదనను కలిగించిందన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. భారీ వర్షాల కారణంగా గోడ కూలడంతో జరిగిన ఈ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు

**సింహాచలం ఘటనపై పవన్ కల్యాణ్, లోకేష్ దిగ్భ్రాంతి**

సింహాచలం అప్పన్న స్వామి ఆలయంలో చందనోత్సవం సందర్భంగా జరిగిన దుర్ఘటన ఆంధ్రప్రదేశ్‌ను తీవ్ర విషాదంలో ముంచింది. ఈ మహెూత్సవంలో పాల్గొన్న వేలాది భక్తుల మధ్య ఒక్కసారిగా గోడ కూలిపోయిన ఘటనలో 7 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వర్షాల ప్రభావంతో పాత గోడ బలహీనమై కూలిపోయినట్టు ప్రాథమిక సమాచారం. ప్రమాద సమయంలో గోడ నిర్మాణానికి ఉపయోగించిన రాళ్లు నేరుగా భక్తులపై పడకుండా ఇనుప ఫెన్సింగ్ అడ్డుపడినట్టు సమాచారం, ఇది ప్రాణనష్టాన్ని నివారించిందని అధికారులు తెలిపారు.

**గాయపడిన వారికి మెరుగైన వైద్యం ః అధికారులపై పర్యవేక్షణ ఆదేశాలు**

ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారికి విశాఖ కేజీ హెచ్ ఆసుపత్రిలో చికిత్స అందుతోందని పేర్కొన్నారు. అవసరమైతే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించాలని అధికారులను ఆదేశించినట్లు ట్విట్టర్ వేదికగా తెలిపారు. ఇది ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొంటూ, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రమాదంపై సమగ్ర సమాచారం కోసం అధికారులను సంప్రదించానని, వర్షాల కారణంగానే గోడ కూలినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు.

### సింహాచలం ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో చోటు చేసుకున్న విషాద ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చందనోత్సవం సందర్భంగా రూ.300ల టికెట్ క్యూలైన్ పై గోడ కుప్పకూలి భక్తులు మృత్యువాత పడటంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. స్వామివారి నిజరూప దర్శనానికి వచ్చిన భక్తులు ఇటువంటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని, మరణించిన భక్తుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# మృతుల కుటుంబాలకు

## రూ.25 లక్షల పరిహారం

సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రులు అనిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవస్థాన అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయంపై సిఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించారు.

# సింహచలం ఘటనపై

# మోడీ విచారం..

## నష్టపరిహారం ప్రకటన

కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున, గాయపడిన వారికి రూ. 50వేల చొప్పున పరిహారం ప్రకటించారు. కాగా, లక్ష్మీనరసింహ స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు క్యూలైన్లలో ఉన్న సమయంలో వారిపై గోడ కూలడంతో తొమ్మిది మంది చనిపోయారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. మరో నలుగురు గాయపడినట్టు సమాచారం. క్షతగాత్రులను విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స అందిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ. 300 టికెట్ కౌంటర్ వద్ద ఉన్న ఓ గోడ కుప్పకూలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

# ఏపీతో సహా మూడు

# రాష్ట్రాలలో మోడీ పర్యటన

## షెడ్యూల్ విడుదల

పర్యటించనున్నారు. ముంబైలో వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను పీఎం ప్రారంభిస్తారు. దాదాపు 25 దేశాలకు చెందిన మంత్రుల భాగస్వామ్యంతో గ్లోబల్ మీడియా డైలాగ్ సదస్సు జరుగనుంది. అలాగే కేరళలోని విజింజం అంతర్జాతీయ డీప్ వాటర్ మల్టీపర్పస్ ఓడరేవును ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి పూర్తిస్థాయి కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అమరావతిలో 58,000 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు ప్రధాని. ఏపీ బహుళ రోడ్డు , రైలు ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి.. అక్కడ నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

# అమరావతి పునఃప్రారంభం

# కార్యక్రమానికి అందరూ తరలిరండి

తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో డీఆర్డీవో, డీపీఐఐటీ, ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వేలకు సంబంధించిన మరో రూ.57,962 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని సీఎం వివరించారు. గత ప్రభుత్వంలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు, ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించారని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పది నెలల్లోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేస్తామని, విశాఖలో టీసీఎస్, వేగంగా నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం, శ్రీసిటీలో ఎల్జీ కంపెనీ రూ.5 వేల కోట్ల పెట్టుబడి వంటివి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని సీఎం పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ఎన్డీఏ లక్ష్యమని, స్వర్ణాంధ్ర విజన్-2047తో ముందుకు వెళు తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని నిర్వీర్యం చేసిందని, రైతుల త్యాగాలను వృధా చేసిందని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీల సహకారంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఇతర రాష్ట్రాల ప్రజలు తమ రాజధానుల గురించి గర్వంగా చెప్పుకున్నట్లే "మా అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వపడేలా రాజధానిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రాజధాని నిర్మాణం ద్వారా వచ్చే ఆదాయంతో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలని, వారిని అన్ని విధాలా గుర్తిస్తామని, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని సీఎం భరోసా ఇచ్చారు. వచ్చే నెలలో అన్నదాత, తల్లికి వందనం పథకాలు ప్రారంభిస్తామని ప్రకటించారు.

# సింహాచలం ప్రమాద ఘటనపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

పాల్గొన్నారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు తెలుసుకున్నారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు సిఎం ఆదేశం ఆదేశించారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పరిహారం, గాయపడిన వారికి రూ.3 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయంగా ప్రకటించారు. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయ శాఖలో పరిధిలోని ఆలయాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే సింహాచలం ఘటనపై ముఖ్యమంత్రి ఉండవల్లిలోని తన నివాసంలో డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

# తెలంగాణ పదో తరగతి ఫలితాలు

# విడుదల

అభినందించారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు సుమారు 5,09,403 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి ఫలితాల్లో 98.2 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ఏకంగా 98.7% ఉత్తీర్ణత నమోదైంది. గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఫలితాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://bse.telangana.gov.in%/ లో చూసుకోవచ్చు. గతంలో విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా గ్రేడ్లు, సీజీపీఏలు మాత్రమే ఇచ్చే విధానానికి బదులుగా.. ఈసారి రాత పరీక్షలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్ మార్కులను విడిగా చూపిస్తూ.. మొత్తం మార్కులు, గ్రేడ్లను మెమోలో చేర్చారు. కనీస మార్కులు వస్తే పాస్ అని, లేదంటే ఫెయిల్ అని మార్కుల మెమోపై నమోదు చేశారు.

**రెసిడెన్షియల్ స్కూళ్ల ఫలితాలు భేష్**

రాష్ట్ర వ్యాప్తంగా 98.2 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. రెసిడెన్షియల్ స్కూళ్లలో 98.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సారి అనూహ్యంగా ప్రైవేటు స్కూళ్ల కంటే ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో అత్యధిక ఉత్తీర్ణ శాతం నమోదు కావడం విశేషం. బాలురు 91.32 శాతం, బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణులయ్యారు. 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. 99.29 శాతంతో మహబూబాబాద్ జిల్లా అగ్ర స్థానంలో నిలిచింది. 73.97 శాతంతో చివరి స్థానంలో వికారాబాద్ జిల్లా ఉంది.

# పిసిసి చీఫ్ షర్మిల హౌస్ అరెస్ట్ ..

ఈ ప్రాంతంలో పర్యటించాలని షర్మిల నిర్ణయించగా.. అందుకు పోలీసులు ఆంక్షలు విధించారు. ఉద్దండరాయునిపాలెంలో పర్యటనకు అనుమతి లేదంటూ షర్మిల ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఆ ప్రాంతానికి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. షర్మిల ఇంట్లో నుంచి బయటకు రాకుండా ఆమె నివాసం వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే పోలీసుల తీరుపై ఏపీసీసీ చీఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైన ఉద్దండరాయుని పాలెం వెళ్లి తీరుతానని షర్మిల స్పష్టం చేశారు. ఈ క్రమంలో షర్మిల నివాసం వద్ద హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

**హౌస్ అరెస్ట్ ఎందుకు చేశారు %ా.**

%'ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు%ా% విజయవాడలోని నా విల్లాలో నన్ను ఎందుకు గృహ నిర్బంధంలో ఉంచారు? ఏ కారణం చేత అనేది%ా% దయచేసి ఏపీ ప్రజలకు సమాధానం చెప్పండి. నేను ఎక్కడకైనా వెళ్లే హక్కు నాకు ఉంది. ఏపీసీసీ అధ్యక్షురాలిగా పీసీసీ కార్యాలయానికి వెళ్లడం నేరమా. మీరు మా రాజ్యాంగ హక్కులను ఎందుకు కాలరాయడానికి ప్రయత్నిస్తున్నారు? మీ ప్రభుత్వం దేనికి భయపడుతోంది?' అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా షర్మిల ప్రశ్నలు సంధించారు.

# ఘనంగా చందనోత్సవం







సింహాచలం ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**ఉత్తరాంధ్ర అరాధ్య దైవమైన శ్రీ వరహాలక్ష్మినృసింహస్వామి చందనోత్సవ కార్యక్రమాన్ని అధికార్లు ఘణంగా నిర్వహించారు . వైశాఖ శుద్ధ అక్షయతృతీయ బుధవారం నాడు భక్తుల హరిహర నామ స్మరణల నడుమ చందన స్వామి నిజరూప దర్శనంలో సాక్షాత్కరించారు . ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కుడా అత్యంత ప్రతిష్టాత్మకంగా చందన యాత్రను నిర్వహించారు . షుమారు 1 గంట ప్రాంతంలో పుణ్యహావచనం , విశ్వక్సేన , ఆరాధన కార్యక్రమం జరిపారు . ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాలచార్యులు , ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అధ్వర్యంలో స్వామివారిపైనున్న చందనాన్ని తొలగించారు . అనంతరం స్వామిని సుప్రభాత సేవతో మెల్కొలిపారు . చందనం వొలుపు కార్యక్రమం పూర్తిఅయిన వెంటనే షుమారు 3 గంటలకు విజయనగర మహారాజు వంశీయులైన పూసపాటి అశోకగజపతి రాజు చందనస్వామిని దర్శించుకున్నారు .**

ప్రతి ఏడాది లాగే ఈసంవత్సరం కుడా ప్రభుత్వం తరపున స్వామికి సంప్రదాయ వస్త్రాలు సమర్పించారు . టి.టి.డి. తరపున స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు . అనంతర 4 గంటలకు వి.వి.ఐ.పి. లకు స్వామి దర్శన బాగ్యం కల్పించారు . ముందు రోజు నుండే 300 రూపాయలు , ఉచిత లైనుల లో వేచివుండి బుదవారం తెల్లావారు ఝూమున అనుకున్న సమయం కు ముందుగానే చందన స్వామి దర్శన భాగ్యన్ని ఆలయ అధికార్లు కల్పించారు . ఉదయం 4 గంటలనుండి 1500 రూపాయల 1000 రూపాయల టికెట్లు గల భక్తులకు దర్శనం కల్పించారు . చందనస్వామి ని దర్శించున్నవారిలో రాష్ట్ర హెూమ్ మంత్రి అనిత , భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు , బండారు సత్యనారాయణ , గణబాబు , నగర మేయరు పీలా శ్రీనివాసరావు , పలువురు రాజకీయ ప్రముఖులు , జిల్లా కలెక్టరు , నగర సి.పి. స్వామిని దర్శించుకున్న వారిలో ఉన్నారు . స్వామి దర్శన అనంతరం భక్తులకు ఉచితంగా లడ్డు ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు . అడుగడుగున ఉచిత మంచినీటి బాటిల్స్ , వైద్య శిబిరాలు , మరుగుదొడ్లు , ఎండవేడిమి తట్టుకునే విధంగా షామియానాలు ఏర్పాటు చేశారు . శాంతి భద్రతల పరిరక్షణ లో భాగంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కొండపైన , కొండదిగువ ట్రాఫిక్ నియంత్రణ జరిపారు . ఆర్.టి.సి . బస్సులు నిర్విరామంగా వేకువఝామునుండే కొండపైకి , దిగువకు ఉచితంగా భక్తులను చేరవేస్తారు . నగర సి.పి. ఆద్వర్యం లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి పర్యవేక్షించారు . చందనం వొలుపు అయిన వెంటనే ఆకాశం మేఘావృతమై జల్లులు పడి వాతావరణం చల్లపడింది . భక్తులు శీఘ్రదర్శనం చేసుకునే విధంగా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనరు కె .రామచంద్రమోహన్ పర్యవేక్షణ జరిపారు .





## ప్రధాని అధ్యక్షతన 'సూపర్ క్యాబినెట్' భేటీ..

### పుల్వామా ఘటన తర్వాత తొలిసారి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఘటనకు భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో బుధవారం ప్రధాని నరేంద్రమోదీ పలు కీలక సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు. దేశ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకొనే క్యాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ రోజు రెండోసారి సమావేశమైంది. అనంతరం రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీ జరిగింది. ఇక, ఈరోజు సాయంత్రం క్యాబినెట్ సమావేశం కూడా నిర్వహించనున్నారు.**

### సూపర్ క్యాబినెట్..

సీసీపీఏ అనేది అత్యంత శక్తివంతమైన గ్రూప్. దానిని 'సూపర్ క్యాబినెట్' అని కూడా పిలుస్తారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతర పరిణామాల నేపథ్యంలో నాడు సీసీపీఏ భేటీ అయింది. ఆ తర్వాత ఈ క్యాబినెట్ కమిటీ మళ్లీ సమావేశం కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2019లో పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ వాహనంపై జరిగిన దాడిలో 40 మంది జవాన్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దానిపై దేశంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ఈ దారుణ ఘటనపై ప్రతీకార చర్యలు, పరిస్థితిని సమీక్షించేందుకు ఆనాడు సీసీపీఏ సమావేశమైంది. ఆ సమావేశంలోనే పాకిస్థాన్‌కు ఉన్న 'అత్యంత అనుకూల దేశం' వాణిజ్య హెూదాను రద్దు చేయాలని భారత్ నిర్ణయించింది. ఆ ఏడాదిలో కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం బాలాకోట్‌లోని ఉగ్రవాద శిబిరాలపై వైమానిక దాడి చేసి, దాయాదికి గట్టి సమాధానం ఇచ్చింది.

అత్యంత కీలక సందర్భాల్లో మాత్రమే సీసీపీఏ సమావేశం అవుతుంది. దేశంలోని ముఖ్యమైన రాజకీయ, ఆర్థిక విషయాలను సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటుంది. రాజకీయ చిక్కులు కలిగి ఉన్న ఆర్థిక విధానాలు, అంతర్గత భద్రతా సమస్యలపై చర్చలు, నిర్ణయాలు ఉంటాయి. వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయానికి సహాయపడుతుంది. దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలను ఈ భేటీలో చర్చిస్తారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హెూంమంత్రి అమిత్‌షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# ఏం చేస్తారో మీ ఇష్టం

## భారత సైన్యానికి పూర్తి స్వేచ్ఛ చ్చిన ప్రధాని మోదీ..!

అమరావతి ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ముగ్గురు సైన్యాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత, ప్రతీకారం తీర్చుకోవడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు.**



పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ముగ్గురు సైన్యాధిపతులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పాల్గొన్నారు. ఈ సమావేశం తర్వాత, ప్రతీకారం తీర్చుకోవడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. మన ప్రతీకారం ఎలా ఉండాలి? దాని లక్ష్యాలు ఎలా ఉండాలి? దాని సమయం ఎలా ఉండాలి వంటి కార్యాచరణ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ సాయుధ దళాలకు ఇస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

భారత సాయుధ దళాల వృత్తిపరమైన సామర్థ్యాలపై ప్రధాని మోదీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ పద్ధతి, లక్ష్యం, సమయాన్ని నిర్ణయించే అధికారం సైన్యానికి ఇచ్చారు. సైన్యం సామర్థ్యాలపై ప్రధానమంత్రి పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఉగ్రవాదానికి బలమైన ప్రతిస్పందన ఇవ్వాలనే భారతదేశం దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు. సమావేశంలో, త్రివిధ దళాధిపతులు వారి కార్యాచరణ అంచనాలు, కార్యాచరణ ప్రణాళికలను ప్రధాని మోదీకి వివరించారు. ప్రధానమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం సైన్యానికి ఒక ముందస్తు అనుమతిగా, ప్రతీకారం తీర్చుకునే స్వేచ్ఛగా భావిస్తున్నారు

ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి తర్వాత దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబికింది. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కార్యాచరణలోకి వచ్చింది. భారతదేశ ఆత్మపై దాడి చేసేవారు నాశనం అవుతారని ప్రధాని మోదీ అన్నారు. దీని తరువాత, దేశం మొత్తం ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్నవారిపై కఠినమైన చర్య కోసం ఎదురు చూస్తోంది. ఇంతలో, మంగళవారం(ఏప్రిల్ 29) సాయంత్రం ప్రధానమంత్రి నివాసంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, సీడీఎస్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు కూడా పాల్గొన్నారు. ఉగ్రవాదానికి తగిన సమాధానం ఇవ్వడం మన దృఢ జాతీయ సంకల్పం అని ఈ సమావేశంలో ప్రధానమంత్రి స్పష్టమైన మాటలలో ఆదేశించారు. భారత సాయుధ దళాల వృత్తిపరమైన సామర్థ్యాలపై ప్రధానమంత్రి పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దీంతో పాటు, మన ప్రతీకార పద్ధతి, దాని లక్ష్యాలు ఏమిటి, దాని సమయం ఏమిటో గురించి కార్యాచరణ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ సైనిక దళాలకు ఉందని ఆయన అన్నారు.

ఈ ఉగ్రవాద దాడి ఏప్రిల్ 22న కాశ్మీర్‌లోని ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో గుర్తు తెలియని ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మంది అమాయక పౌరులను, ఎక్కువగా పర్యాటకులను దారుణంగా చంపారు. ఈ దాడి ఇటీవలి సంవత్సరాలలో పౌరులపై జరిగిన అత్యంత క్రూరమైన దాడిగా పరిగణిస్తున్నారు. ఈ సంఘటనలో పాల్గొన్న ఉగ్రవాదులు నరమేధం సృష్టించిన, అడవి వైపు పారిపోయారు. ఈ సంఘటన తర్వాత, దేశం మొత్తం ప్రభుత్వం తదుపరి చర్యపై దృష్టి సారించింది.

ఉగ్రవాద దాడి జరిగిన రెండు రోజుల తర్వాత, అంటే ఏప్రిల్ 24న, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బీహార్‌లోని మధుబని జిల్లాలో నిర్వహించిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ఉగ్రవాదులకు, వారిని ప్రోత్సహిస్తున్న వారికి గట్టి హెచ్చరిక చేశారు. ఈ దాడి చేసిన ఉగ్రవాదులు, ఈ దాడికి కుట్ర పన్నిన వారికి ఊహించలేని విధంగా పెద్ద శిక్ష పడుతుందని ప్రధాని అన్నారు.

ఉగ్రవాద దాడిలో అమాయక పౌరులు మరణించిన క్రూరత్వాన్ని చూసి యావత్ దేశం విచారంలో మునిగిపోయిందని ప్రధానమంత్రి అన్నారు. దేశస్థులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ దుఃఖ సమయంలో, దేశం మొత్తం బాధితుడి కుటుంబానికి అండగా నిలుస్తుంది. ఉగ్రవాద దాడిలో, ఒకరు తన కొడుకును కోల్పోయారు, మరొకరు తన సోదరుడిని కోల్పోయారు, మరొకరు తన జీవిత భాగస్వామిని కోల్పోయారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, మరణం పట్ల మన దుఃఖం ఒకటేబీ మా కోపం కూడా ఒకటే. దేశ శత్రువులు భారతదేశ ఆత్మపై దాడి చేయడానికి ధైర్యం చేశారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

గురువారం 01 మే 2025

## పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు భరోసాగా తెలుగుదేశం పార్టీ

### టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్



**మలికిపురం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు భరోసాగా నిలబడి ఉండే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ అన్నారు.సఖినేటిపల్లి మండలం గుడిమూల గ్రామ శాఖ సమావేశం గ్రామాశాఖ అధ్యక్షులు మేడిది రత్నం రాజు అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కష్టపడి సభ్యత్వాలు జాయిన్ చేసిన ప్రతి కార్యకర్తను అభినందించారు.రాజోలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా వారిపిల్లలకు భరోసాగా ఉన్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ సఖినేటిపల్లి గ్రామంలో ఒక రోడ్డు శంకుస్థాపనలో ప్రోటోకాల్ ప్రకారం చంద్రబాబు నాయుడు పేరు శిలాఫలకంపై లేకపోవటాన్ని కార్యకర్తలు నా దృష్టికి తీసుకొచ్చారని,అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాతాను.అనంతరం కార్డ్స్ పంపిణి నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ,గ్రామ సర్పంచ్ దెందుకూరి వెంకట శ్రీహరి రాజు,గ్రామ ప్రధాన కార్యదర్శి గూడపల్లి వెంకట రమణ,టిడిపి ఉపాధ్యక్షులు కుచ్చర్లపాటి రామకృష్ణ రాజు,బూత్ కమిటీ కన్వీనర్ కార్య నిర్వహక కార్యదర్శి గొర్ల రవి కృష్ణ,పాలపర్తి రెడ్డి,డాక్టర్ రాజోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి తాడి మోహన్ బాబు,డాక్టర్ రుద్రరాజు పద్మరాజు ,సఖినేటిపల్లి నీటి సంఘం ఉపాధ్యక్షులు కందుల సూర్యచంద్రరావు మాజీ సర్పంచ్,నీటి సంఘం డైరెక్టర్స్ మండెల గంగాధర్ బాబు,తమ్మినిడి శ్రీనివాస్,రాపాక రత్న కుమార్ టీడీపీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన అవకాశాలు.

### ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ.



**అయినివిల్లి, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు అందేలా డా.బి.ఆర్.అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని బుధవారం సిరిపల్లిలో జరిగిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాల పాటు దేశంలో నిర్భంధ కులవృత్తులు అమలయ్యాయని అన్నారు. అలా కాకుండా ప్రతీ మనిషి తన ఇష్టానికి అనుగుణంగా వృత్తి ని ఎంచుకునే అవకాశం భారత రాజ్యాంగం ద్వారా సమకూరిందని ఆయన వివరించారు. ఈ రోజు వృత్తిని తమ ఆశక్తి మేరకు ఎంపిక చేసుకుని కొనసాగే అవకాశం ఆర్టికల్ 15 ద్వారా ప్రతీ భారతీయుడికీ బహూకరించబడిందన్నారు. రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించటం పౌర సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. దీనికి ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బొక్కా రామచంద్ర రావు, కుంచే చంద్రకాంతుడు, కుప్పాల రాంబాబు, అక్కిశెట్టి దుర్గారావు జంగా పండు, కుంచే నాని, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కప్పల శ్రీధర్.



**రావులపాలెం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధిగా నియమించ బడిన తరువాత తొలిసారిగా వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు కప్పల శ్రీధర్. సోమవారం తాడేపల్లిలో పార్టీ సెంట్రల్ ఆఫీస్ రాష్ట్రవ్యాప్త జిల్లా అధికార ప్రతినిధుల వర్క్ షాప్ లో పాల్గొని బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో హైదరాబాదులో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొత్తపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకం పట్ల చూపిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మీవంటి నాయకత్వం పార్టీ బలోపేతానికి గట్టిగా కృషిచేసి 2029 లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు తన సహాయ సహకారాలు, పూర్తి తోడ్పాటు అందిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి దేవిద్రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గాన్ని గంగాధర్, కర్రీ నాగిరెడ్డి, ముసునూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లొల్లలో త్రీవెల్ సైఫాన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన.



**ఆత్రేయపురం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నీటిముంపు సమయాల్లో రైతుల వెతలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం వద్ద సైఫాన్ ను అభివృద్ధి పనులకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ నిధుల నుండి రూ.2 కోట్ల 34 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేయనున్న ఈ పనులు లొల్ల, వాడపల్లి, ర్యాలీ గ్రామాల మీదుగా జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సైఫాన్ అభివృద్ధి పరచడం వల్ల రైతులకు మేలు జరగనుండటం తో ఆ గ్రామాల రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో రమేష్



**కడియం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉపాధి హామీ పథకం ద్వారా కడియం మండలంలో చేపడుతున్న కాలువ పూడిక తీత పనులను బుధవారం ఎంపీడీవో కె. రమేష్ పరిశీలించారు. ఇందులో భాగంగా మురమండ ముత్యాలమ్మ గుడి వద్ద కాలువలో పూడికతీత పనిని పరిశీలించారు. ఆ కూలీల హాజరు నమోదు వివరాల రికార్డును తనిఖీ చేసారు. ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారికి ఎక్కడికక్కడే తాగునీరు అందుబాటులో ఉంచాలని గ్రామ కార్యదర్శి రావిపాటి సత్యనారాయణకు ఎంపీడీవో రమేష్ సూచించారు.

## రూ.2.34 కోట్లతో సైఫాన్ నిర్మాణ పనులు ప్రారంభం



**ఆత్రేయపురం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామం వద్ద పొలాలు ముంపుకు గురి కాకుండా త్రీ వెల్ సైఫాన్ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు సమయాల్లో రైతుల వెతలు తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.2.34 కోట్ల స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ నిధులతో ఈ పనులు లొల్ల, వాడపల్లి, ర్యాలీ గ్రామాల మీదుగా జరగనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సైఫాన్ అభివృద్ధి పరచడం వల్ల రైతులకు మేలు జరగనుండటంతో ఆ గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కరుటూరి నరసింహారావు, సర్పంచులు కాయల జగన్నాథం, మెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## అంబేద్కర్‌కు ఘన నివాళి

**అమలాపురం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జనుపల్లి గ్రామంలోని అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీ మెట్ల రమణబాబు గారు, ఆముడా చైర్మన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు గారు, మాజీ %ఎజూజూ% బొర్రా ఈశ్వరరావు గారు, మాజీ కౌన్సిలర్ దున్నాల దుర్గా గారు, వాకపల్లి స్వామి నాయుడు గారు, ఈతకోట నాగేశ్వరరావు గారు మరియు తదితరులు పాల్గొన్నారు

## సింహాచలం ఘటనలో అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులు ఇద్దరు మృతి







**అంబాజీపేట, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో భారీ వర్షానికి గోడ కూలిన ఘటనలో ఇద్దరు అంబేద్కర్ నగర్ కోనసీమ వాసులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో అంబాజీపేట కొర్లపాటి వారి పాలెంకు చెందిన కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (26), పత్తి దుర్గాస్వామి నాయుడు (33) మృతి చెందారు. అంబాజీపేటలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడు పత్తి దుర్గా స్వామి నాయుడు జనసేన నాయకుడు పత్తి దత్తుడు చిన్న కుమారుడుగా గుర్తించామన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజధాని నిర్మాణంతో బావితరాలకు బంగారు భవిష్యత్.

### -జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి.



**కొత్తపేట, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం అమరావతి 2.0 కు శ్రీకారం చుట్టిందని అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రూ.65 వేల కోట్లతో 217 స్క్వేర్ కిలోమీటర్లతో 80352 స్క్వేర్ కి.మీ విస్తీర్ణంలో రాజధాని అమరావతి రూపుదిద్దు కోబోతుందని చెప్పారు. అమరావతి ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందనీ చెప్పారు. అమరావతి నగర విద్యుత్ అవసరాల నిమిత్తం 2,700 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని వినియోగించు కునేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయని చెప్పారు. రాజధానిలో పునర్నిర్మాణ పనులకు రూ.48,012.67 కోట్ల వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందనీ తెలిపారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి రూ.15 వేల కోట్ల రుణం మంజూరైందని జర్మనీకి చెందిన డెవలప్మెంట్ బ్యాంకు కేఎఫ్ డబ్ల్యూ నుంచి రూ.5 వేల కోట్లు రుణం పొందేందకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టిందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలు పూర్తిచేసి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మరో రూ. 4,400 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. మొత్తం రూ.15,400 కోట్లు అమరావతి నిర్మాణానికి టిడ్కో రుణ సదుపాయం కల్పించడం హర్షణీయమన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందన్నారు. అమరావతి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సినవసరం లేదనీ ప్రభుత్వ ఆదీనంలో ఉన్న భూమిని దశలవారీగా అమ్ముతూ రాజధాని నిర్మాణానికి చేసిన అప్పులను వడ్డీలతో సహా చెల్లించ వచ్చునన్నారు. మిగిలిన డబ్బుని 175 నియోజకవర్గాల అభివృద్ధికి వినియోగించు కోవచ్చునీ రాజధానిలో నిర్మాణాలు అన్నీ పోగా మిగిలిన రూ.2లక్షల కోట్ల పైబడి విలువైన మిగులు భూములు అమరావతిలో ఉన్నాయన్నారు. పదేళ్ల తరవాత సైబరాబాద్ వద్ద పెరిగినట్లు ఇక్కడ భూములు విలువ ఎకరం 50 కోట్లకు పైగా పెరుగుతుందని చెప్పారు. అమరావతి మునిగిపోయే రాజధాని అని, అమరావతి నిర్మాణం కోసం సమకూర్చుకున్న నిధులను ప్రజల నుండే వివిధ రూపాల్లో వసూలు చేస్తారని వైసీపీ పార్టీ అబద్దపు ప్రచారం చేస్తుందన్నారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యాసంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని చెప్పారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని నిర్మించడానికి మద్దతు తెలిపి, అధికారంలోకి వచ్చాక 3 రాజధానుల పేరుతో కుల చిచ్చు, ప్రాంతీయ చిచ్చు పెట్టి తన కుంభకోణాల నుండి ప్రజల దృష్టి మళ్లించే కుట్ర చేశారన్నారు. ఏపీలో 3 రాజధానులు పెడతామంటూ ప్రచారం చేసిన జగన్ రెడ్డి, అసెంబ్లీలో అడ్డగోలు తీర్మానాలతో హడావుడి చేసి, శాసనమండలిలో 3 రాజధానుల బిల్లులు పాస్ చేయలేదనే నెపంతో చైర్మన్ షరీఫ్ గారిపై దాడి చేశారని గుర్తుచేశారు. అమరావతిని పూర్తిగా చంపేయాలనే దుష్ట ఆలోచనలతో జగన్ రెడ్డి అండ్ కో రాజధాని రైతులను చిత్ర హింసలకు గురి చేశారన్నారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చాడని, ఎక్కడి పనులు అక్కడే ఆపేశాడన్నారు. రోడ్లను తవ్వేసి వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచిపెట్టాడన్నారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటీరియల్ ను కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేయించారన్నారు. అమరావతిని శ్మశానం అని, ఎడారి ప్రాంతం అని, ఒక్క సామాజిక వర్గానికి చెందిన ప్రాంతం అని అమరావతిపై కమ్మరావతి అని విద్వేష వ్యాఖ్యలు చేశారన్నారు. వాస్తవానికి అమరావతి ప్రాంతంలో దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారని, కాపు, ముస్లిం, బ్రాహ్మణ, వైశ్య వర్గాలు అన్నీ కుడి ఎడమగా ఉన్నాయన్నారు. దళిత రైతులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు తరలించి హింసించారన్నారు. ఇన్ని నిర్బంధాల్లో సైతం 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేశారని, ఈ సుదీర్ఘ పోరాటంలో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారన్నారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు... పోరాటాలు మరోవైపు... న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతున్నాయని చెప్పారు.



## ప్రజల సామాజిక అవసరాలకు ప్రభుత్వ ఖాళీ స్థలాలను వినియోగంలోకి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజల సామాజిక అవసరాలకు ప్రభుత్వ ఖాళీ స్థలాలను వినియోగములోనికి తీసుకురానున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కాళ్ల మండలంలోని పెద అమిరం పంచాయతీ పరిధిలోని పలు ఖాళీ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వీఆర్వోను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టాటా మార్గ్ (పెద అమిరం పుంత రోడ్డు) లోని మూడు లేఔట్లను, గుడివాడ రోడ్ లోని వెంకటాద్రి రాయల్ ఎస్టేట్ లేఅవుట్ లలో పంచాయతీకి కేటాయించిన 10 శాతం స్థలాలను పరిశీలించారు. రానున్న వారం రోజుల్లో లే అవుట్ల యజమానులతో సమావేశమై ప్రభుత్వ స్థలాల అభివృద్ధికి సంబంధించి చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకర జీవితాన్ని గడపాలనే లక్ష్యంతో ఖాళీ స్థలాలను పరిశీలించి వినియోగంలోనికి తీసుకురావాలని భావిస్తున్నట్లు తెలిపారు. అడ్వెంచరల్ స్పోర్ట్స్, పార్క్స్, వాకింగ్ ట్రాక్స్, అమ్యూజ్మెంట్ పార్క్స్, ప్లే గ్రౌండ్స్, స్కేటింగ్ కోర్ట్స్, స్విమ్మింగ్ పూల్స్, తదితరాలను పిపిపి మోడ్ లో అభివృద్ధికి ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో పంచాయతీ సెక్రెటరీ నాగేంద్ర, వీఆర్వో కుమార్, తదితరులు ఉన్నారు.

## రాజధాని నిర్మాణంతో బావితరాలకు బంగారు భవిష్యత్

### - ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు.



**మచిలీపట్నం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత వైసిపి ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందని, అంతర్జాతీయ స్థాయిలో రాజధాని నిర్మించాలనే ధృడసంకల్పంతో ఉన్నామని ఆర్టీసీ చైర్మన్, కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు బుధవారం ఒక ప్రకటన లో తెలియచేయజేశారు. అమరావతిలో వచ్చేనెల 2వ తేదీన సాయంత్రం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి రూ. 43 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతాయని వెల్లడించారు. రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని 3 ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో ముందుకు వెళుతోందని తెలిపారు. జగన్ తన ఐదేళ్ళ పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చి, ఎక్కడి పనులు అక్కడ ఆపేసి, రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటరియల్ ను కూడా వైసిపి ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేసి కాంట్రాక్టర్లను అక్కడ నుండి తన్ని తరిమేసి పైశాచికానందం పొందారని ఆరోపించారు. జగన్ రెడ్డి నిర్వాకం వల్ల రూ.2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలి పోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇన్ని నిర్బంధాల్లో సైతం 1631 రోజుల పాటు నిర్విరామంగా రాజధాని రైతులు పోరాటాలు చేసి, సుదీర్ఘ పోరాటంతో 230కి పైగా రైతులు వేధింపులు తాళలేక ప్రాణాలొదిలారు. రైతుల ప్రాణత్యాగాలు ఓవైపు, పోరాటాలు మరోవైపు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా అలా నిలబడిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు గారి పరిపాలనా దక్షతతో ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకులను ఒప్పించి తెచ్చిన నిధులతో అమరావతి పనులు రానున్న కాలంలో పరుగులు పెట్టబోతుండటం రాష్ట్రానికి శుభ పరిణామం అని గుర్తు చేసారు.

## తాగునీటి ఎద్దడిని నివారించలేని మండల పాలకవర్గం



**విఆర్‌పురం, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వి.ఆర్. పురం మండలం గుర్రంపేట గ్రామం పెదవులపల్లి పంచాయతీలో గత అనేక సంవత్సరాలుగా పరిపాలిస్తున్న సిపిఎం గుర్రంపేట గ్రామాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి చిన్నచూపు చూస్తుందని పరిష్కారంలో చిత్తశుద్ధి లేదని భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆరోపించింది. గుర్రంపేట గ్రామంలో వీధిలైట్లు లేవని, కరెంటు స్తంభాలు ఒరిగిపోయాయని, మంచినీటి బోర్లు సక్రమంగా పని చేయట్లేదని బిజెపి మండల కమిటీ తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి జల్ జీవన్ మిషను, గ్రామీణ రోడ్లు, ఉపాధి హామీ నిధులు వస్తున్నప్పటికీ సిపిఎం పార్టీకి చెందిన ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచులు గుర్రంపేట నూతుగూడెంలకు రాకుండా అడ్డుకొని నిధులను దారి మళ్లిస్తూ దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఓట్లు మాత్రం గుర్రంపేట నుతుగూడెం తీసుకుంటారు. నిధులు మాత్రం ఖర్చు పెట్టరా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా గుర్రంపేట గ్రామానికి తాగునీరు, రోడ్లు, నూతిగూడెం బ్రిడ్జి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈరోజు వి.ఆర్. పురం మండల బిజెపి సమావేశం ముత్యాల రాంబాబు అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో బిజెపి నాయకులు పాయం వెంకయ్య, కడుపు వెంకటరమణ, ముత్యాల రాంబాబు, సోంది నాగేశ్వరావు, ఉయిక రత్తయ్య పాల్గొన్నారు.

## మే 2న భారత ప్రధాన మంత్రి పాల్గొనే రాజధాని పునఃనిర్మాణ పనుల

# కార్యక్రమ సభను సమిష్టిగా జయప్రదం చేద్దాం

**ఏలూరు ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మే 2న గౌ. భారత ప్రధాన మంత్రి పాల్గొనే అమరావతి రాజధాని పునఃనిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మే 2న గౌ. ప్రదాని నరేంధ్రమోది పాల్గొనే అమరావతి రాజధాని పునఃనిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. రవాణా, త్రాగునీరు సదుపాయం, ట్రాఫిక్ సమస్యలు లేకుండా సభా వేదికకు చేరుకోవడం వంటి సన్నాహక ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుండి 300 బస్సులో 13,250 మంది తరలి వెళ్లేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లే ప్రజలకు ఎటువంటి సమస్య లేకుండా మంచినీరు, వైద్య సదుపాయం, ఆహారం అందించడంతో పాటు రాక పోకలకు ఎలాంటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమయానికల్లా బస్సులను సిద్ధం చేయాలని ఉప రవాణా కమీషనర్ ను ఆదేశించారు. ప3తి బస్సుకు





మెడికల్ సిబ్బందిని కేటాయించాలన్నారు. ప్రధాని పర్యటనకు ప్రజలను తీసుకువెళ్లి తిరిగి తీసుకొచ్చేవరకు మోనాటరింగ్ చేసుకునేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రధాన మంత్రి పర్యటనలో భాగంగా జిల్లా ప్రజలను ఆయా బస్సుల్లో పంపేందుకు విధులను కేటాయించిన ప్రతిఒక్క అధికారి, సిబ్బంది, బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు.

## కృష్ణార్జున ఫౌండేషన్ అధర్వములో

# అగ్నిబాధిత కుటుంబానికి వితరణ



**చింతూరు, ఏప్రిల్ 30(తెలుగు రాష్ట్రం విలేకరి):**

అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఆర్. పురం మండలం చొక్కనపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తోడం రాంబాబు ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధిత కుటుంబానికి కృష్ణార్జున ఫౌండేషన్ అధ్యక్షుడు కాకునూరు కృష్ణార్జునరావ్ బియ్యం, దుప్పట్లు, బకెట్, చాప, నూనె బాటిల్, సబ్బులు, కూరగాయలు మొదలైన నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉప సర్పంచ్ తోడం బూబమ్మ మాట్లాడుతూ... మారుమూల



గ్రామమైన మా చొక్కనపల్లి గ్రామానికి వచ్చి అగ్ని బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందించడం అనేది చాలా గొప్ప విషయమని, గ్రామం తరపున కాకునూరు కృష్ణార్జునరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తోడం రాజు, పులి ధర్మరాజు, వార్డ్ మెంబర్ గొంది ధారయ్య, తోడం అనీలు, తోడం మంగమ్మ, తోడం సీతారామరాజు, నోముల శ్రీనివాసరావు, బాగుల శ్రీనివాసరావు, గొల్ల వెంకన్న పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట




**జీలుగుమిల్లి, ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):**

రాచన్నగూడెంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వందలాది మంది ఆడపడుచులు ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. అంతకు ముందు అమ్మవారిని పోలవరం నియోజకవర్గ వైకాపా కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి, వైకాపా నాయకులు వీరంకి వెంకటేశ్వరరావుతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా గ్రామ సర్పంచ్ సున్నం వరలక్ష్మి, పి. అంకంపాలెం ఎంపీటీసీ నాలి శ్రీనివాసరావు, పేరుబోయిన దాము, వనమా రామకృష్ణ, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఈ మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.




## రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై

# జీలుగు విత్తనాల పంపిణీ

**పోలవరం, ఏప్రిల్ 30 (తెలుగు రాష్ట్రం విలేకరి):**

పోలవరం మండల పరిధిలో 3 రైతు సేవా కేంద్రాలలో 50% రాయితీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కె. రాంబాబు తెలిపారు. బుధవారం కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ గూటాల 1 రైతు సేవా కేంద్రాల్లో 20 క్వింటాలు, గూటాల- 2 రైతు సేవా కేంద్రాల్లో 30 క్వింటాలు, పట్టిసీమలో 10 క్వింటాలు, పోలవరం మూడు రైతుసేవ కేంద్రాల్లో 40 క్వింటాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. మండలంలో 100 క్వింటాలు జిలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. విత్తనాలు పంపిణీ కార్యక్రమంలో కూటమి నేతలు గుణపర్తి చిన్ని, కర్రీబండి నాగరాజు, పాదం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మావుళ్లమ్మ దేవస్థానంలో మహాలక్ష్మి హోమం

**భీమవరం ఏప్రిల్ 30 (తెలుగురాష్ట్రం విలేకరి):**

అక్షయ తృతీయ సందర్భంగా భీమవరం శ్రీమావుళ్లమ్మ ఆలయంలో బుధవారం సంప్రదాయ బద్ధంగా మహాలక్ష్మి హెూమం నిర్వహించారు. దేవస్థానం ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించి ఆలయ ప్రాంగణంలో 300 మంది భక్తులచే వేద మంత్రాలతో మహాలక్ష్మి హెూమం నిర్వహించారు. ప్రజలు అందరికి సిరి సంపదలు భాగ్యం కొసం అద్భుతమైన మహా సంకల్పంతో ఈ హెూమం నిర్వహించామని అన్నారు.



# ఆ నీరు పాక్‌కు వెళతాయి.. మాకివ్వండి

## పంజాబ్‌ను అభ్యర్థించిన హరియాణా

హరియాణా : పంజాబ్ వద్ద భాక్రా రిజర్వాయర్‌లో అదనంగా మిగిలిపోయిన తాగునీరు తమకు ఇవ్వాలని హరియాణా అభ్యర్థించింది. లేకపోతే.. ఆ నీరు పాకిస్థాన్‌కు వెళ్లడం మినహా ప్రయోజనం లేదని పేర్కొంది. భారత్ సింధూ జలాల ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రకటన విడుదల చేశారు. సింధూ జలాల ఒప్పందం పరిధిలోని అతిపెద్ద ఆనకట్టల్లో ఇది కూడా ఒకటి కావడం విశేషం.




"జూన్ నాటికి భాక్రా నంగల్ ఆనకట్టను ఖాళీ చేయడం అవసరం. అప్పుడే వర్షాకాలంలో నదీ జలాలను నిల్వ చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లో అప్పుడు నీరు లేకపోతే.. అదనపు జలాలు హరి-కె-పట్టాన్ నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్లిపోతాయి. అది అటు పంజాబ్.. ఇటు హరియాణాకు ఉపయోగపడదు.

దిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లు నీటి విడుదలకు పంజాబ్ ప్రభుత్వానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ప్రస్తుతం అక్కడ ఆప్ ప్రభుత్వం లేదు. అలాంటి సమయంలో దిల్లీ ప్రజలను శిక్షించేలా అలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తున్నారు. అసలు హరియాణాకు రావాల్సిన వాటా జలాలే అందుబాటులోకి రాలేదు. గత నెల భాక్రా బేస్ మేనేజ్‌మెంట్ బోర్డ్ విడుదల చేసిన నీటిలో పంజాబ్, రాజస్థాన్, దిల్లీకి పోగా హరియాణాకు మిగిలింది కేవలం 6,800 క్యూసెక్కులు మాత్రమే. ఇక న్యాయంగా హరియాణాకు రావాల్సిన వాటా ఇచ్చినా.. అది భాక్రా ప్రాజెక్టులో నిల్వ ఉండే నీటిలో 0.0001 శాతానికి సమానం" అని నాయబ్ సింగ్ సైనీ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం చీనాబ్, జీలమ్ సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని సైనీ కోరారు. ప్రస్తుతం భాక్రానంగల్ ప్రాజెక్టు పంజాబ్, హరియాణా, రాజస్థాన్ నీటి అవసరాలను తీరుస్తోంది.

# పహల్గాం దాడి ఘటన దృశ్యాలను విడుదల చేయనున్న కేంద్రం!

పహల్గాం : పహల్గాం ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. ఆ ఘటన వీడియోలను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. వాటితో పాటు గతంలో పాక్ ఉగ్రవాదులు భారత్‌లో పాల్పడిన దాడుల దృశ్యాలను బయటపెట్టాలని భావిస్తున్నట్లు సమాచారం. పాక్ చేస్తున్న ఘోరాలను ప్రపంచానికి చూపించే ఉద్దేశంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది. సిమ్లా ఒప్పందంతోపాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కనబెడుతున్నట్లు ప్రకటించింది.

ఇక నిన్న ప్రధాని మోదీ నివాసంలో నిర్వహించిన కీలక సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, త్రిదళాధిపతి (సీడీఎస్) అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్, ఆర్మీ, నేవీ, ఐఏఎఫ్ అధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు గంట పాటు జరిగిన భేటీలో దేశంలో అంతర్గత భద్రతతో పాటు సరిహద్దులో నెలకొన్న పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులను శిక్షించాలన్నది దేశ ప్రజల దృఢ నిశ్చయమని ప్రధాని మోదీ ఈసందర్భంగా స్పష్టంచేశారు. మన సైనిక దళాల సామర్థ్యాలపై సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు.

# 'మేం ఎప్పటికీ మోకరిల్లం'..

## అమెరికాకు చైనా గట్టి సందేశం

**చైనా : ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తులైన అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం రాజుకుంది. టారిఫ్‌ల విషయంలో ఇరుదేశాలు తగ్గేదే లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఈక్రమంలో అమెరికా సుంకాలకు భయపడి తాము వారి ముందు మోకరిల్లమని పేర్కొంటూ బీజింగ్ ఓ వీడియో సందేశాన్ని విడుదల చేసింది.**



చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ వీడియోను షేర్ చేసింది. అందులో 'అమెరికా ప్రపంచవ్యాప్తంగా టారిఫ్ అనే తుపాను రేపింది. ఉద్దేశపూర్వకంగా చైనాను లక్ష్యంగా చేసుకుంది. ఇతర దేశాలతో 90 రోజుల పాజ్ అనే గేమ్ ఆడుతోంది. బీజింగ్ వాణిజ్యాన్ని దెబ్బతీయాలని చూస్తోంది. వేధింపులకు తలొగ్గడం అంటే.. గొంతు తడుపుకోవడం కోసం విషం తాగడంతో సమానం. ఇది సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది' అని పేర్కొంది.

ఈసందర్భంగా అగ్రరాజ్యం ఆర్థిక విధానాలను గురించి ఈ వీడియోలో ప్రస్తావించింది. 'జపాన్ పెద్దఎత్తున సెమీకండక్టర్లను దిగుమతి చేసుకుందని యూఎస్ ఒకప్పుడు ఆరోపించి తోషిబా వంటి కంపెనీలను అణగదొక్కిందని పేర్కొంది. ప్లాజ్మా ఒప్పందంపై సంతకాలు చేయమని జపాన్‌ను బలవంతం చేసింది. ఇది ఆ దేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. న్యాయశాఖను అస్త్రంగా చేసుకొని ఫ్రాన్స్‌కు చెందిన పలు కంపెనీలను దోచుకుంది. రాజీ పడితే దయ లభించదని చరిత్ర నిరూపించింది. మోకరిల్లడం వల్ల బెదిరింపులు మరింత పెరుగుతాయి. చైనా ఎప్పటికీ మోకరిల్లదు. చైనా వెనక్కి తగ్గదు. కాబట్టి బలహీనుల గొంతులే వినిపిస్తాయి. ప్రపంచమంతా ఒకటిగా నిలబడితే అమెరికా ఒక చిన్న పడవ మాత్రమే' అని అందులో పేర్కొంది. ఇక, అమెరికా టారిఫ్‌ల ప్రకటన తర్వాత నుంచి చైనా ఇలాంటి వీడియోలను విడుదల చేస్తూ వస్తోంది.

అధికారంలోకి వచ్చినప్పటినుంచి చైనాపై టారిఫ్‌ల కొరడా విసురుతున్న ట్రంప్.. బీజింగ్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాన్ని 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

# పీవోకేను స్వాధీనం చేసుకోవడమే పరిష్కారం..

## భారత్‌కు బ్రిటిష్ ఎంపీ సూచన



బ్రిటన్ : పహల్గాం ఉగ్రదాడిని దేశ ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు.

పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్ అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు.

### ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరిస్తాం: బ్రిటన్

పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను కోరుతున్నట్లు బ్రిటన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఉగ్రవాద నిర్మూలనలో న్యూదిల్లీకి తాము ఎప్పటికీ అండగా ఉంటామని తెలిపింది. పహల్గాం ఘటనకు వ్యతిరేకంగా ఇటీవల లండన్‌లో భారతీయులు నిరసన చేపడుతున్న సమయంలో అక్కడి పాకిస్థాన్ హైకమిషన్ అధికారి వారిని బెదిరిస్తున్నట్లు ఉన్న వీడియో తమను ఆందోళనకు గురి చేసిందని తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నామని వెల్లడించింది. ఇరుదేశాలతో తమకు సత్సంబంధాలు ఉన్నందున వారి మధ్య ఉద్రిక్తతలు చెలరేగాలని తాము కోరుకోవట్లేదని పేర్కొంది. కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకొని.. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడాన్ని భారత్-పాక్ తమ బాధ్యతగా భావించాలని సూచించింది.

# ఇంటి కింద బంకర్.. ప్రభుత్వ సెక్యూరిటీ

# హాఫీజ్ సయీద్ నివాసం ఇలా..!



**పహల్గాం : పహల్గాంలో పర్యాటకులపై జరిపిన పాశవిక దాడి వెనక లష్కరే తోయిబా హస్తం ఉన్నట్లు ఇప్పటికే పలు కథనాలు వెలువడ్డాయి. ఈ దాడికి పాల్పడింది 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ముష్కరులే అయినా.. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం లష్కరే తోయిబా చీఫ్, భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఈ పరిణామాల వేళ హాఫీజ్‌కు సంబంధించి ఓ సంచలన వార్త వెలుగులోకి వచ్చింది. అతడు పాక్‌లో ప్రభుత్వ భద్రత మధ్య బహిరంగంగా జీవిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఓ ఆంగ్ల మీడియా తమ కథనంలో వెల్లడించింది.**

### ప్రైవేటు పార్క్, బంకర్..

సాధారణంగా ఉగ్ర నాయకులు ఎవరికీ తెలియని రహస్య ప్రదేశాల్లో దాక్కుని.. అక్కడినుంచే తమ కార్యకలాపాలకు సంబంధించి ఆదేశాలిస్తుంటారు. కానీ, హాఫీజ్ సయీద్ జీవనం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. అతడు లాహోర్‌లోని జోరమ్ తౌమ్ అనే అత్యంత రద్దీ ప్రాంతంలో సామాన్యపౌరులతో కలిసి నివసిస్తున్నట్లు సమాచారం. హాఫీజ్ నివాసం వద్ద పాక్ ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ సిబ్బంది నిరంతరం భద్రత కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ భవనంలో హాఫీజ్ తన కుటుంబంతో పాటు నివసిస్తున్నారట. ఇంటిముందు ఓ ప్రైవేటు పార్క్, పక్కనే మసీదు, మదర్సా కూడా ఉన్నట్లు సమాచారం. భవనం కింద ఓ బంకర్ కూడా ఉందని సదరు కథనం పేర్కొంది.

### జైల్లో ఉన్నాడంటూ పాక్ బుకాయింపులు

హాఫీజ్ సయీద్ పాక్‌లో బహిరంగంగా తిరుగుతున్నట్లు గత కొంతకాలంగా కథనాలు వస్తూనే ఉన్నాయి. కానీ, ఆ దేశ ప్రభుత్వం మాత్రం వాటిని తోసిపుచ్చుతూనే ఉంది. ఉగ్ర సంస్థకు నిధులు సమకూర్చి కేసులో అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడిందని, అతడు జైల్లోనే ఉన్నాడని బుకాయిస్తోంది. 2019లో హాఫీజ్ అరెస్టయినట్లు కథనాలు వచ్చాయి. ఆ మధ్య హాఫీజ్ అనుచరులు, లష్కరే ఉగ్రవాదుల వరుస హత్యలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ పరిణామాలతో అతడికి పాకిస్థాన్ భద్రత పెంచినట్లు తెలుస్తోంది. అతడి ఇంటినే సబ్‌జైలుగా మార్చినట్లు వార్తలు వినిపించాయి.

2008 నవంబరు 26న దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో పాటు మరెన్నో ఉగ్ర దాడుల్లో హాఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను.. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది.

# ప్లేఆఫ్స్‌నకు ఏ జట్టు ఎంతెంత దూరం?

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు మధ్య మ్యాచ్ జరిగింది. ఈ ఉత్కంఠ పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ఫలితంతో ప్లేఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఇక టీమ్‌ల వారీగా వాటి అవకాశాలను పరిశీలిస్తే..




### ప్రస్తుతానికి టాప్ 1గా ఆర్సీబీ

పాయింట్ల పట్టికలో ఆర్సీబీ (%=శీఝశ్రీ జష్ట్రఝశ్రీశ్రీవఅస్త్రవతీం దీవఅస్త్రుశ్రీబతీబ%) ప్రస్తుతానికి మొదటిస్థానంలో ఉంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఖాతాలో ఇప్పటికే 14 పాయింట్లు ఉన్నాయి. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన ఆర్సీబీ 7 మ్యాచుల్లో విజయం సాధించింది. ఇంకా మిగిలిఉన్న నాలుగు మ్యాచుల్లో రజత్ పటీదార్ సేన కేవలం రెండు మ్యాచ్‌లు గెలిస్తే చాలు టాప్ 4లో నిలుస్తుంది. తద్వారా ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకుంటుంది

### ముంబయి ఇండియన్స్ ఇదే జోరు కొనసాగిస్తే..

ముంబయి ఇండియన్స్ జట్టు తాను ఆడిన 10 మ్యాచుల్లో 6 విజయాలు సాధించింది. 12 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. హార్దిక్ పాండ్య సారథ్యంలో జట్టు వరుసగా అయిదు మ్యాచుల్లో విజయకేతనం ఎగురవేసింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో 3 విజయాలు సాధిస్తే టాప్ 4లో నిలుస్తుంది. రెండు విజయాలతోనూ ప్లేఆఫ్స్‌కు వెళ్లే అవకాశాలు ముంబయి ముంగిట ఉన్నాయి.

### గుజరాత్ టైటాన్స్‌కు పెద్ద కష్టమేం కాదు!

గుజరాత్ టైటాన్స్ ఇప్పటివరకు ఆడిన 9మ్యాచుల్లో 6 విజయాలు సాధించింది. 12 పాయింట్లతో ప్రస్తుతానికి పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఈ టీమ్ ఇంకా 5 మ్యాచులు ఆడాల్సిఉంది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు కనీసం రెండు మ్యాచుల్లో విజయం సాధించినా ప్లేఆఫ్స్‌నకు అవకాశాలుంటాయి. మూడు మ్యాచుల్లో విజయం సాధిస్తే మాత్రం నేరుగా టాప్ 4లోకి దూసుకుపోతుంది.

### ఢిల్లీ క్యాపిటల్స్ పరాజయాల పరంపర ఆగితేనే..

ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన ఢిల్లీ క్యాపిటల్స్ 6 మ్యాచుల్లో విజయం సాధించింది. కానీ గత 6 మ్యాచుల్లో వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓటమి పాలైంది. అయినప్పటికీ అక్షర్‌పటేల్ సారథ్యంలోని ఢిల్లీ జట్టు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. వీరికి మరో నాలుగు మ్యాచులు ఉన్నాయి. వీటిలో కనీసం 2 గెలిస్తేనే ప్లేఆఫ్స్ రేసులో నిలుస్తారు.

### పంజాబ్ కింగ్స్.. కుదిరితే 3.. లేదంటే కనీసం 2

పంజాబ్ కింగ్స్ 9 మ్యాచుల్లో 5 విజయాలు సాధించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో మ్యాచ్ వర్షార్పణం కారణంగా 11 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. మరో 5 మ్యాచులు ఆడాల్సిఉంది. వీటిలో కనీసం మూడింట్లో విజయం సాధించాల్సి ఉంటుంది. రెండు విజయాలతోనూ టాప్ 4లో నిలిచే అవకాశాలను కొట్టిపారేయలేం.

### లఖ్‌నవూకు లక్ కలిసి రావాలంటే...!

ఐపీఎల్ వేలంలో భారీ ధర పలికిన రిషభ్ పంత్... ఆటకు ఆ స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నాడు. ఇప్పటివరకు లఖ్‌నవూ 10 మ్యాచ్‌లు ఆడితే 5 మ్యాచుల్లో మాత్రమే విజయం సాధించింది. అయినా లఖ్‌నవూకు ద్వారాలైతే ఇంకా పూర్తిగా మూసుకుపోలేదు. మిగిలిన నాలుగు మ్యాచుల్లో కనీసం మూడింట్లో అయినా విజయం సాధిస్తే టాప్4లో స్థానం దక్కించుకోవచ్చు.

### కోల్'కథ' మారాలంటే!

అజింక్య రహానే సారథ్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ తాము ఆడిన 10 మ్యాచుల్లో కేవలం నాలుగింట్లో మాత్రమే విజయం సాధించింది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో కనీసం మూడింట్లో అయినా తప్పక విజయం సాధిస్తేనే ప్లేఆఫ్స్‌నకు ఏమైనా అవకాశం ఉంటుంది.

### రాజస్థాన్‌కు స్థానం దక్కాలంటే...

రాజస్థాన్ రాయల్స్ జట్టు తమకు మిగిలిన నాలుగు మ్యాచుల్లో విజయం సాధిస్తే మొత్తం 14 పాయింట్లకు చేరుకుంటుంది. ఈ పాయింట్లతో టాప్-4కు వెళ్లడం కష్టమే అయినా... ఇతర జట్ల ఫలితాల ఆధారంగా ప్లేఆఫ్స్‌నకు వెళ్లొచ్చు.

### హైదరాబాద్ అన్నింట్లోనూ గెలిస్తేనే!

భారీ అంచనాలతో ఐపీఎల్ 2025 సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తన పేలవ ప్రదర్శనతో అభిమానులను నిరాశ పరిచింది. ఇంకా తమకు మిగిలిఉన్న అయిదు మ్యాచులకు అయిదింట్లోనూ వరుసగా విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌లో స్థానం దక్కించుకోవచ్చు.


### ఫ్చ్.. చెన్నై సూపర్‌కింగ్స్!

ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్‌లు ఆడిన చెన్నై సూపర్ కింగ్స్ కేవలం రెండింట్లో మాత్రమే విజయం సాధించింది. ఇంకా అయిదు మ్యాచులు మిగిలిఉన్నాయి. వీటన్నింటిలోనూ విజయం సాధించినా ప్లేఆఫ్స్‌నకు చేరడం దాదాపు అసాధ్యం. చెన్నై సూపర్‌కింగ్స్ టాప్ 4లో నిలవాలంటే నిజంగా ఏదైనా అద్భుతమే జరగాలి.

# రికార్డుల బాహుబలి.. రో'హిట్' బర్త్ డే...

నేడు హిట్‌మ్యాన్ పుట్టినరోజు సందర్భంగా రోహిత్ అభిమానులు అనితర సాధ్యమైన అతడి రికార్డులన్నింటినీ ఓసారి నెమరువేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఫేవరేట్ బ్యాటర్‌కు బర్త్‌డే విషెస్ చెబుతున్నారు.






ఈ రోజు టీమ్‌ఇండియా కెప్టెన్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బర్త్‌డే. అతడు 37 సంవత్సరాలు పూర్తి చేసుకొని 38 లోకి అడుగుపెడుతున్నాడు. కొన్ని ఏళ్లుగా రోహిత్ శర్మ భారత జట్టుకు తన సేవలు అందిస్తున్నాడు. ఈక్రమంలో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈనేపథ్యంలో కేవలం హిట్ మ్యాన్‌కే సాధ్యమైన కొన్ని రికార్డుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

### వన్డేల్లో రారాజు

రోహిత్ శర్మకు వన్డే క్రికెట్‌లో అద్భుతమైన రికార్డులున్నాయి. సెంచరీ చేయడమే గగనమైపోతున్న ఈ రోజుల్లో హిట్‌మ్యాన్‌కు ఏకంగా ఈ ఫార్మాట్లో మూడు డబుల్ సెంచరీలున్నాయి. రోహిత్ శర్మకు వన్డే ఫార్మాట్లో 264 పరుగులు అత్యధిక వ్యక్తిగత స్కోరు. వన్డేల్లో ఒక టీమ్ కొట్టే స్కోర్ ఇది. టీమ్ అంతా కొట్టే స్కోర్‌ను రోహిత్ శర్మ ఒక్కడే బాది చూపించాడు. 2014 నవంబరు 13న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో, రోహిత్ శర్మ శ్రీలంకపై 264 పరుగులు చేసి వన్డే క్రికెట్‌లో కొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. ఇంతవరకు ఈ రికార్డు బ్రేక్ కాలేదు. ఈ ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ 33 ఫోర్లు, 9 సిక్స్‌లు బాదాడు.

### వరల్డ్ కప్‌లో శతకాల వర్షం..

2019 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ పేరిట అద్భుతమైన రికార్డు ఉంది. తాను ఆడిన తొమ్మిది ఇన్నింగ్స్‌ల్లో ఏకంగా 5 సెంచరీలు నమోదు చేశాడు. ఇప్పటివరకు ఒక వరల్డ్‌కప్‌లో ఏ బ్యాటర్ కూడా ఇన్ని సెంచరీలు చేయలేదు.

### పొట్టి ఫార్మాట్‌లోనూ గట్టోడే!

కేవలం వన్డేల్లోనే కాదు.. పొట్టి ఫార్మాట్ అయిన టీ20ల్లోనూ రోహిత్ శర్మకు ఘనమైన రికార్డుంది. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఈ ఫార్మాట్లో 5 సెంచరీలు చేశాడు. ఇందులో ఓ సెంచరీని కేవలం 35 బంతుల్లోనే పూర్తి చేశాడు.

### సిక్సుల మోతే..

ఆడేది అయిదు రోజుల టెస్ట్‌మ్యాచ్ అయినా, 50 ఓవర్ల వన్డే అయినా, 20 ఓవర్ల పొట్టి క్రికెట్ అయినా.. ఫార్మాట్ ఏదైనా రోహిత్ శర్మ ఫార్ములా ఒక్కటే.... సిక్సుల మోత మోగించడం. ఇప్పటివరకు రోహిత్ శర్మ ఏకంగా 637 సిక్స్‌లు బాది, ఈ జాబితాలో ప్రథమస్థానంలో ఉన్నాడు. ఈ లిస్ట్‌లో యూనివర్సల్ బాస్ క్రిస్‌గేల్ 553 సిక్స్‌లతో రెండోస్థానంలో ఉన్నాడు. అలాగే వరల్డ్ కప్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీ లాంటి ఐసీసీ వన్డే టోర్నమెంట్లలోనూ రోహిత్ శర్మ 68 సిక్సులు బాదాడు. ఈ జాబితాలోనూ హిట్‌మ్యానే టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అలాగే ఆస్ట్రేలియా మీద 132 సిక్స్‌లు బాదాడు. ఒక ప్రత్యర్థి జట్టుపై రోహిత్ తప్ప ఏ బ్యాటర్ కూడా ఇన్ని సిక్స్‌లు కొట్టలేదు. కేవలం సిక్సులే కాదు.. ఫోర్లలోనూ రోహిత్ శర్మకు ఒక రికార్డు ఉంది. తన 264 పరుగుల ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు బాదాడు కదా! ఒక వన్డే ఇన్నింగ్స్‌లో ఇన్ని ఫోర్లు కొట్టిన బ్యాటర్ ఇంకెవరూ లేరు. మొత్తానికి మన హిట్ మ్యాన్‌కు మంచి ఘనమైన రికార్డులే ఉన్నాయి. నేడు అతడి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు వీటన్నింటినీ ఓసారి నెమరువేసుకుంటూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ ఫేవరేట్ బ్యాటర్‌కు బర్త్‌డే విషెస్ చెబుతున్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ కచ్చితంగా పుంజుకుంటుంది: విప్రాజ్ నిగమ్



ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ పోరులో మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతా 205 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ ముందు ఉంచింది. ఛేజింగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. హోం గ్రౌండ్‌లో ఢిల్లీకిది మూడో ఓటమి. ప్రస్తుతం ఈ జట్టు 12 పాయింట్లతో పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టు స్పిన్ ఆల్‌రౌండర్ విప్రాజ్ నిగమ్ మీడియాతో మాట్లాడాడు. తమ టీమ్ తిరిగి కచ్చితంగా విజయాల బాట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు.

'మేం కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు చెందిన ఇద్దరు ప్రధాన స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని ఆడాలనుకున్నాం. మొదటి రెండు ఓవర్లలో మేం అనుకున్న ప్రణాళికను బాగానే అమలు చేశాం. కానీ మా బ్యాటర్లు కొన్ని తప్పుడు షాట్ సెలక్షన్స్ వల్ల ఔటయ్యారు. తర్వాత వచ్చిన బ్యాటర్లు వెంటనే పెద్ద షాట్లు ఆడి స్కోర్ రాబట్టాలంటే అంత సులభం కాదు. అప్పటికే సెట్టైన ప్లేయర్లుంటే మేం తేలిగ్గా గెలిచి ఉండేవాళ్లం. ఐపీఎల్ ప్రయాణం ఎప్పుడూ సాఫీగా సాగదు. ఇందులో ఒడుదొడుకులు సాధారణం. మేం ఇప్పటికే టాప్ 4లో ఉన్నాం. మా చేతిలో ఇంకా అయిదు మ్యాచులున్నాయి. మేం కచ్చితంగా తిరిగి పుంజుకుంటాం. ప్లేఆఫ్స్‌నకు స్థానం సంపాదించడమే కాదు. టాప్2లో ఉంటాం' అని విప్రాజ్ నిగమ్ అన్నాడు.

# రహానే కోలుకోవడానికి రెండు మూడు రోజులు పట్టొచ్చు: అనుకుల్ రాయ్





ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు తలపడింది. ఈ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ 14 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అయితే ఈ మ్యాచ్ సందర్భంగా కోల్‌కతా కెప్టెన్ అజింక్య రహానే గాయపడ్డాడు. చివరి తొమ్మిది ఓవర్లలో జట్టును సునీల్ నరైన్ ముందుండి నడిపించాడు. షార్ట్ కవర్‌లో ఫీల్డింగ్ చేస్తున్న క్రమంలో రహానే చేతికి గాయమైంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ డుప్లెసిస్ గట్టిగా కొట్టిన బంతి అజింక్య రహానే చేతిని తాకింది. దీంతో అతడు మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆట ముగిసేంత వరకు తిరిగి అతడు గ్రౌండ్‌లోకి రాలేదు. చేతికి కట్టుతో కనిపించాడు. 'అది మరీ అంత తీవ్రమైన గాయం కాదు. ఓ రెండు మూడు రోజుల్లో రహానే కోలుకునే అవకాశం ఉంది. అతడికి కొన్ని కుట్లు పడ్డాయి. డాక్టర్లు పరిస్థితిని అంచనా వేసి మరింత స్పష్టత ఇస్తారు. కానీ ప్రస్తుతానికైతే అతడు బాగానే ఉన్నాడు' అని కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్ అనుకుల్ రాయ్ వెల్లడించాడు.



## ప్రత్యేక పాటలతో పాపులర్ అయిన నోరా ఫతేహి.. భారీగా ఆదాయం

### కెనడా నుంచి బాలీవుడ్ వరకు %-% నోరా ఫతేహి ప్రేరణాత్మక ప్రయాణం

సినీ పరిశ్రమలో స్థిరమైన గుర్తింపు సంపాదించడం ఎంతటి కష్టమైన పని అనేది నోరా ఫతేహి జీవితం చెబుతుంది. టొరంటో, కెనడాలో జన్మించి పెరిగిన నోరా, బాలీవుడ్ వైపు మొగ్గినప్పుడు ఆమె వద్ద ఉన్న మొత్తం డబ్బు కేవలం రూ.5,000 మాత్రమే. కానీ అప్పుడు ఆమెకి ఉన్న తాపత్రయం, నటిగా ఎదగాలనే సంకల్పం ఆమెను ఇండియాకు తీసుకొచ్చింది. ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఆమె ఎన్నో అవమానాలు, కష్టాలు, మోసాలు ఎదుర్కొన్నప్పటికీ, వెనక్కి తగ్గలేదు. ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని, చిన్న చిన్న అవకాశాలను పెద్ద అవకాశాలుగా మార్చుకుంది. ఇండియాకు వచ్చాక మొదట్లో ఆమె జీవితం అతి దారుణంగా సాగింది. ఒక ఇంటర్వ్యూలో ఆమె చెప్పిన విషయాల ప్రకారం, తొమ్మిది మంది మానసిక రోగులతో కలసి మూడు బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో జీవించింది. జీవనానికి తగినంత డబ్బు లేక, గుడ్డు, బ్రెడ్, పాలు తాగుతూ కాలం వెళ్లదీసింది. ఒక ఏజెన్సీ చేతిలో మోసపోయి, తన పారితోషికం నుంచి అద్దె, కమిషన్ పేరుతో డబ్బులు కట్ చేసి ఇచ్చిన విషయాలు ఆమె చెబుతుంటే, అప్పటి బాధలు స్పష్టంగా కనిపిస్తాయి. అయినా ఆమె ధైర్యాన్ని కోల్పోలేదు. తన లక్ష్యాన్ని మరిచిపోలేదు. నోరా కెరీర్‌లో అసలైన మలుపు 'దిల్ బర్' సాంగ్‌తో వచ్చింది. 2018లో విడుదలైన ఈ పాట ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. శత్రు మూవీలో ఈ పాట పాపులర్ కావడం వల్ల ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అంతేకాదు, ఈ పాట యూట్యూబ్‌లో బిలియన్ల వ్యూస్ సాధించడమే కాకుండా, ఆమెకు అంతర్జాతీయ గుర్తింపు కూడా తెచ్చింది. ఆ తర్వాత ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి %-% స్పెషల్ నెంబర్లు, బ్రాండ్ ప్రమోషన్లు, స్టేజి షోలు ఇలా విస్తృతంగా పేరుపొందింది. ఆమె నటించిన టెంపర్, బాహుబలి: ది బిగినింగ్, కిక్ 2 వంటి తెలుగు సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ ద్వారా సౌత్ ప్రేక్షకులకు కూడా చేరువైంది. ఈ పాటల ద్వారా ఆమె డాన్సింగ్ స్కిల్స్‌కి మంచి పేరు తెచ్చుకుంది. నేడు ఆమె ఒక సాంగ్‌కు రూ.2 నుంచి రూ.3 కోట్లు వసూలు చేస్తూ ఇండస్ట్రీలో హై పెయిడ్ ఐటెం డ్యాన్సర్లలో ఒకరిగా నిలిచింది.

## సినీనటుడు అజిత్ కాలికి గాయం



చెన్నై : ప్రముఖ సినీనటుడు అజిత్ చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాలికి స్వల్ప గాయమైందని, ప్రమాదమేమీ లేదని వైద్యులు వెల్లడించినట్టు అజిత్ టీమ్ జాతీయ మీడియాకు వెల్లడించింది. సాయంత్రం డిశ్చార్జ్ అయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. అజిత్ ఆరోగ్యంపై ఆందోళన వద్దని అభిమానులకు సూచించింది. పద్మభూషణ్ అవార్డు స్వీకరణ అనంతరం అజిత్ కుటుంబం ఢిల్లీ నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు మంగళవారం రాత్రి చేరుకుంది. ఆ సమయంలోనే భారీ సంఖ్యలో అభిమానులు సినీనటుడివైపు దూసుకురావడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలోనే అజిత్ కాలికి స్వల్ప గాయమైనట్టు టీమ్ వివరించింది.

## నాని 'హిట్ 3' సినిమా టికెట్ ధరల పెంపు..

### ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగల్




శైలేష్ కొలను దర్శకత్వంలో నేచురల్ స్టార్ నాని, శ్రీనిధి శెట్టి జంటగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'హిట్ 3'. ఈ సినిమా రేపు (మే 1న) ప్రేక్షకుల ముందుకు వస్తోంది. అయితే, ఈ మూవీకి ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. టికెట్ ధర పెంపునకు గ్రీన్ సిగల్ ఇచ్చింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ. 50 , మల్టీప్లెక్సుల్లో రూ. 75 పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పెరిగిన ధరలు వారం రోజుల పాటు అమలులో ఉంటాయని ఉత్తర్వులలో పేర్కొంది.

## 'తుడరం' బాక్సాఫీస్ రికార్డు



మలయాళ చిత్రం 'తుడరం' అన్ని తరగతుల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీసు వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. మోహన్‌లాల్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు చేసిన సినిమాగా రికార్డుకెక్కింది. ఈ సినిమాలో మోహన్‌లాల్, శోభన జంటగా నటించారు. ఎం.రంజిత్ నిర్మాత, తరుణ్‌మూర్తి దర్శకత్వం వహించారు. ప్రకాశ్‌వర్మ, బిను పప్పు, భారతీరాజా, థామస్ మ్యాథ్యూ, సంగీత్ ప్రతాప్, అర్ష చాందిని బైజూ తదితరులు నటించారు. రాజపుత్ర విజువల్ మీడియా బ్యానర్‌పై రూపొందించిన ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదలైంది. అప్పటి నుంచి నేటి వరకూ థియేటర్లు పూర్తి ఆక్యుపెన్సీని నమోదు చేస్తున్నాయి. కేరళతోపాటుగా కర్నాటక, ఆంధ్రా, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఓవర్సీస్‌లో భారీగా ఆదరణ లభిస్తోంది.

### డీడీ నెక్ట్స్ లెవెల్ మూవీ

## ట్రైలర్ విడుదల



తమిళ హీరో సంతానం చేస్తున్న కామెడీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వర్కౌట్ అవుతున్నాయి. ఒకప్పుడు కమెడియన్‌గా కామెడీ చేసి సినిమాల్ని నిలబెట్టేవాడు. ఇప్పుడు హీరోగా మారి లుక్ మొత్తం మార్చేసి తన చిత్రాలతో నవ్విస్తున్నాడు. సంతానం చేసే డీడీ ఫ్రాంఛైజీ చిత్రాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తుంటాయి. హారర్, కామెడీ జానర్లతోనే ఈ డీడీ సీక్వెల్స్‌ను సంతానం తీస్తుంటాడు. ఇక ఇప్పుడు డీడీ నెక్ట్స్ లెవెల్ అని రాబోతోంది. మే 15న ఈ చిత్రం రాబోతోంది. ఈ క్రమంలో ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.డీడీ నెక్ట్స్ లెవెల్ ట్రైలర్‌లో కామెడీ అదిరిపోయింది. పంచ్‌లు ,సెటైర్లు అందరినీ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఇందులో కాన్సెప్ట్ కాస్త డిఫరెంట్‌గా కనిపిస్తోంది. రివ్యూలు రాసేవాళ్లని సినిమా సెట్‌లోకి పంపించి భయపెడుతున్నట్టుగా కనిపిస్తోంది. రివ్యూ రైటర్ల గురించి కౌంటర్లు వేసినట్టుగానే కనిపిస్తోంది. ఇక ఈ ట్రైలర్‌లో సంతానం కామెడీ ఒకెత్తు అయితే చివర్లో గౌతమ్ మీనన్ ఎంట్రీ అదిరిపోయింది. తన బ్లాక్ బస్టార్ కాకా కాకా (తెలుగులో గజినీ) చిత్రంలోని చెలియా చెలియా పాటను రీ క్రియేట్ చేసే ప్రయత్నం చేశాడు. చూస్తుంటే గౌతమ్ మీనన్ నెవ్వర్ బిఫోర్ అనే రోల్‌లో చూడబోతోన్నట్టుగా కనిపిస్తోంది. గౌతమ్ మీనన్ ఇప్పుడు పూర్తిగా సినిమాల్లో నటించడం మీదే ఫోకస్ పెట్టినట్టు అనిపిస్తుంది. దర్శకుడిగా గౌతమ్ మీనన్ మాలీవుడ్‌లో రీసెంట్‌గా ఓ మూవీని తీశాడు. మమ్ముట్టి హీరోగా గౌతమ్ మీనన్ తీసిన ఈ చిత్రం అంతగా ఆకట్టుకోలేకపోయింది.మమ్ముట్టితో సినిమా తీసి కూడా జనాల్లోకి వెళ్లలేకపోయిందంటూ గౌతమ్ మీనన్ అసంతృప్తిని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ప్రమోషన్స్ ఇంకాస్త గట్టిగా చేసి ఉండాల్సిందని, మెగాస్టార్ మమ్ముట్టి సినిమా వచ్చిందన్న విషయం కూడా ఎవ్వరికీ తెలియకుండా పోయిందే అని బాధపడ్డాడు గౌతమ్. అయితే ఆ సినిమాకి కూడా అంత పాజిటివ్ టాక్ ఏమీ రాలేదు. దీంతో అది బాక్సాఫీస్ వద్ద అంతగా మెప్పించలేకపోయింది.




## విజయ్ దేవరకొండ 'కింగ్డమ్'

## ఫస్ట్ సాంగ్ ప్రోమో వచ్చేసింది..

గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ తాజా చిత్రం 'కింగ్‌డమ్. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగ వంశీ నిర్మిస్తున్న ఈ మూవీలోకి విజయ్ జంగటా.. భాగ్యశ్రీ భోర్సే కనిపించనుంది. కాగా, ఎన్టీఆర్ వాయిస్ తో ఈ చిత్రం నుండి ఇప్పటికే గ్లింప్స్ విడుదల చేయగా.. మంచి హైప్ క్రియేట్ అయ్యింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమోని రిలీజ్ చేసారు మేకర్స్. హృదయం లోపల.. అంటూ ఈ పాట ఫుల్ సాంగ్ మే 2న రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఇక కింగ్డమ్ సినిమా వచ్చే మే 30న థియేటర్లలో రిలీజ్ కానుంది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339